పటిష్ట భద్రత ఉండాలి



ప్రభుత్వాస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రిళ్లు కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. విధులు నిర్వహించే ప్రదేశాల్లో మహిళా వైద్యులకు పటిష్ట భద్రత ఏర్పాటుచేయాలి. 24గంటల పాటు సీసీ కెమెరాలు నిఘా ఉండాలి. రోగి సహాయకులపై నియంత్రణ ఉండాలి. ఒకరికే అనుమతి ఇవ్వాలి. వారికి ఎంట్రీ పాస్ ఇవ్వాలి. పరామర్శకు వచ్చే వారికి పరిమిత వేళల్లో మాత్రమే అనుమతి ఇవ్వాలి.

– డాక్టర్ అంబికా రమణి, వైద్యాధికారి, డుంబ్రిగుడ, పీహెచ్‌సీ

పెట్రోలింగ్ నిర్వహించాలి



నైట్ డ్యూటీలు నిర్వహించే మహిళా వైద్యులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలి. అప్పుడే మహిళా వైద్యులు నిర్భయంగా రోగులకు వైద్యం అందించే అవకాశం ఉంటుంది. రాత్రిపూట పోలీసులు ఆస్పత్రులు ఉన్న ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలి. దీంతో దుండగులకు భయం ఏర్పడుతుంది. దాడులు చేస్తే శిక్ష కఠినంగా ఉంటుందనే భీతి దుండగుల్లో కలగాలి

– డాక్టర్ శశికళాదేవి, గైనకాలజిస్ట్, చింతూరు ఏరియా ఆస్పత్రి

సంరక్షణ సెల్‌లు అవసరం



మహిళల సంరక్షణకు ప్రత్యేక సెల్‌లను ఏర్పాటుచేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బంది ప్రత్యేక రక్షణకు చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల్లో విధులు చేసే సమయంలో అనుకోని సమయాల్లో రోగి కుటుంబీకులు, సహాయకులు ఎటువంటి దాడులు చేయకుండా మహిళా పోలీసులను ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలి. మహిళా ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక చట్టం అవసరం.

– డాక్టర్ మనోజ్ఞ , రాజేంద్రపాలెం పీహెచ్‌సీ

నిలువ నీడ కరువు

- శిథిలావస్థలో బస్ షెల్టర్లు
- చెట్ల నీడన నిరీక్షణ
- ఎండైనా...వానైనా ఆరుబయటే పడిగాపులు
- ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కించాయిపుట్టులో బస్ షెల్టర్ లేక చెట్ల నీడలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



శిథిలావస్థలో ఉన్న చోటముఖిపుట్టు బస్ షెల్టర్

ముంచంగిపుట్టు: అసలే మన్య ప్రాంతం ఎప్పుడు ఎండ కాస్తుందో.. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి. దీనికి తోడు ఆర్టీసి బస్సులు సమయపాలన లేకపోవడం.. బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులకు నిలువ నీడ కరువై నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని చాలా చోట్ల బస్‌షెల్టర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముంచంగిపుట్టు నుంచి డుడుమ, జోలాపుట్టు, కుమడ, కుజబంగి మార్గాల వైపు నిత్యం ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ మార్గంలో ఉన్న బస్ షెల్టర్ రేకులు పగిలిపోయి శ్లాబులు పెచ్చులూడిపోయి ఏ క్షణం కూలిపోతాయే తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో బస్ షెల్టర్‌లో ప్రయాణికులు ఉండలేక సమీప చెట్ల నీడలో, ఆరుబయటే బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది.

కూలేందుకు సిద్ధంగా

మండలంలో కుజబంగి బస్ షెల్టర్ శ్లాబు పూర్తిగా కారిపోతుండడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. పనస పుట్టు వద్ద ఉన్న బస్ షెల్టర్ కూలిపోయింది. చోటముఖీపుట్టు బస్‌షెల్టర్ పై రేకు బీటలు వారి కారి పోతుంది. సంగడ బస్ షెల్టర్ పైకప్పు ఎగిరిపోయి నిరుపయోగంగా మారింది. జోలాపుట్టు బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా మారింది. లబ్బూరు బస్ షెల్టర్ శిథిలమైపోయింది. వీటితో పాటు మరికొన్ని బస్‌షెల్టర్లు 25 ఏళ్ల కిందట నిర్మించినవి కావడం విశేషం. అయితే వీటికి నేటి వరకు మరమ్మతులు చేయని పరిస్థితి ఉంది. ఫలితంగా వినియోగం లేవు. కొన్ని బస్‌షెల్టర్లు పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నాయి. విష సర్పాలు, కీటకాలు దర్శనమిస్తున్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గత్యంతరం లేక శిథిలావస్థ బస్ షెల్టర్లు కొద్ది దూరంలో చెట్ల నీడన పడిగాపులు కాస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన బస్ షెల్టర్లు నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కుజభంగి బస్టాప్ దుస్థితి

బస్‌షెల్టర్ నిర్మించాలి



చోటముఖీపుట్టు బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకొంది. వర్షం వస్తే లోపల ఉండలేని పరిస్థితి ఏర్పడింది. సమీపంలోని చెట్ల నీడల్లో నిరీక్షించాల్సి ఉంటుంది. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ బాగు చేయడంతో పాటు నూతన బస్ షెల్టర్ నిర్మిస్తే కష్టాలు తీరుతాయి.

– ఆనందరావు, ముంచంగిపుట్టు గ్రామం, ముంచంగిపుట్టు

అధికారులు స్పందించాలి



రోడ్లపై గంటల కొద్దీ వేచి ఉండేందుకు కష్టంగా ఉంది. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు నిరీక్షణ కష్టాలు అన్నిఇన్ని కావు. అధికారుల దృష్టికి బస్ షెల్టర్ల సమస్యను తీసుకువెళ్లిన స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– కూడా దాసు, గత్తుమలడ గ్రామం, ముంచంగిపుట్టు

ప్రతిపాదనలు పంపాం



బస్సుషెల్టర్లు శిథిలావస్థలో ఉన్న విషయం పలుమార్లు ప్రయాణికులు తీసుకువచ్చారు. బస్సుషెల్టర్లు అవసరమైన ప్రధాన జంక్షన్‌లను ఇప్పటికే గుర్తించాం. ఆర్అండ్‌బీ, పీఆర్ అధికారులు వారి శాఖలకు ప్రతిపాదనలు పంపించారు. నూతన బస్ షెల్టర్ల కోసం నిధులు మంజూరైతే వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– కె.కిరణ్‌కుమార్,ఎంపీడీవో, ముంచంగిపుట్టు

రైతులకు విత్తనాల పంపిణీ



సొవ్వలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, సర్పంచ్ సాయిత

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీలో ఎంపీపీ బాకా ఈశ్వరి, సర్పంచ్ సాయిత తదితరులు రైతులకు రాజ్‌మా విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ రైతులకు అందిస్తున్న రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 90 శాతం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను పండించుకొని రైతులు లాభాలు పొందాలన్నారు. నాయకులు సింహాచలం, అశోక్‌కుమార్, నర్సింగరావు, రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సద్దు, హార్టికల్చర్ అసిస్టెంట్ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

296 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాల పంపిణీకి అనుమతి

ముంచంగిపుట్టు: మండలంలో 296 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు పంపిణీకి అనుమతులు ఇచ్చినట్టు మండల వ్యవసాయశాఖాధికారి ఎ.శ్రీనివాస బాబు తెలిపారు. రాజ్‌మా విత్తనాలు 90శాతం రాయితీపై గిరిజన రైతులకు అందించడం జరుగుతుందన్నారు. మండలంలో కిలగాడ, జోలాపుట్టు, మాకవరం, కుజభంగి, ముంచంగిపుట్టు, కుమడ తదితర ప్రాంతాల్లోని రైతు సేవ కేంద్రాల ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మేరకు రైతులు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖల సహాయకులను సంప్రదించి విత్తనాలు పొందాలని, విత్తనాలు మొలక శాతం నిర్ధారించిన తరువాత రైతులకు రాజ్‌మా విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు.

కాఫీ కొనుగోలుకు చర్యలు

అరకులోయటౌన్: అరకులోయ జీసీసీ బ్రాంచ్ పరిధిలోని అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లోని గ్రామాల్లో కాఫీ రైతులకు కాఫీ విక్రయాలపై అవగాహన కల్పిస్తున్నట్టు అరకులోయ జీసీసీ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జీసీసీ ద్వారా కాఫీ కొనుగోలుపై గిరిజన కాఫీ రైతుల వద్దకు వెళ్లి పాచ్‌మెంట్, చెర్రి, ఫ్రూట్ కొనుగోళ్లపై ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు గ్రామాల్లో జీసీసీ, సోప్ యూనిట్, కాఫీ పూలింగ్ అసిస్టెంట్‌లు కాఫీ రైతులకు అవగాహన కలిప్తారన్నారు. జీసీసీ డీఎం కల్పనకుమారి ఆదేశాల మేరకు కాఫీ కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది పాడేరు ఏజెన్సీలో 2వేల మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు.

5న పాస్టర్ల సెమినార్



సెమినార్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

అరకులోయటౌన్: అరకులోయలో సెప్టెంబర్ 5న పాస్టర్ల సెమినార్ ఏర్పాటు చేయనున్నట్టు పాస్టర్ల ఫెలోషిప్ ప్రతినిధులు రెవరెండ్ సంజీవ్‌కుమార్, ప్రసాద్‌పాల్ తెలిపారు. కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అరకులోయలోని చర్చ్ ఆఫ్ హోలిగాడ్ ప్రార్థన మందిరంలో సెమినార్ కార్యక్రమం జరుగుతుందన్నారు. పాస్టర్లందరు హాజరుకావాలని వారు కోరారు. పలువురు పాస్టర్‌లు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చింతూరు: తపాలా బిళ్లను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ స్పర్శ్ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రవేశపెట్టిందని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చింతూరు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పోస్టల్ సర్కిల్ ద్వారా 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు తరగతికి 10 మంది చొప్పున 40 మందికి నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు గుర్తింపు పొందిన పాఠశాలలో విద్యనభ్యసించాలని, ఫిలాటెలి డిపాజిట్ ఖాతా కలిగి ఉండాలని ఆయన సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను వచ్చేనెల 16వ తేదీ లోగా విశాఖపట్నం రీజియన్ కార్యాలయానికి పంపాలని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

65 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, సిబ్బంది

చింతపల్లి: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో శుక్రవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్టు(విశాఖపట్నం), గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ (హైదరాబాదు) వారిచే నిర్వహించిన ఈ శిబిరంలో 65 మందికి పరీక్షలు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.ప్రభావతి, వైద్యాధికారులు నాగ మణికంఠ, గౌతమ్, క్యాంప్ కో–ఆర్డినేటర్ కనకేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదవాలి



అవగాహన కల్పిస్తున్న కృష్ణవేణి

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగిలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు సెల్‌ఫోన్ వల్ల కలిగే దుష్ప్రభావాన్ని మహిళా పోలీసు బి.కృష్ణవేణి వివరించారు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడడం వంటివి చేయవద్దన్నారు. గంటలకొద్దీ వీడియోలు వీక్షించడంతో సమయం వృథా అవుతుందని, తద్వారా చదువుపై శ్రద్ధ కోల్పోతారన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు లక్ష్యం నిర్ణయించుకొని కష్టపడి ప్రణాళికబద్ధంగా చదవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్‌ఫోన్ వినియోగించకుండా చూడాలని సూచించారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు



ఏవో ఉమాదేవి

కొయ్యూరు: 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తామని ఏవో ఉమాదేవి శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్లకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు రాయితీ ఉంటుందని చెప్పారు. పవర్ టిల్లర్లకు రూ.లక్ష వరకు రాయితీ వస్తుందన్నారు. మిగిలిన పరికరాలకు రూ.50 వేల వరకు రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. సన్న, చిన్నకారు రైతులు, మహిళా రైతులకు ఈ రాయితీలు వర్తిస్తాయన్నారు. పరికరాలు కావలసిన వారు సంబంధిత రైతు సేవా కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

స్పెషల్ బ్రాంచ్ సీఐగా అప్పలనాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలనాయుడు

పాడేరు : జిల్లా స్పెషల్ బ్రాంచి సీఐగా బి.అప్పలనాయుడు శుక్రవారం పాడేరు జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పాడేరు స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేసిన హిమగిరిను పోలీస్ అధికారులు అరకు సీఐగా బదిలీ చేశారు. దీంతో అయన స్థానంలో విశాఖపట్నం రేంజ్‌లో పని చేస్తున్న అప్పలనాయుడును నియమించారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనను పోలీస్ శాఖ కార్యాలయంలో సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కొయ్యూరు: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. ఆమె శుక్రవారం అడాకుల పంచాయతీల కిరచెలి, కిష్టారం కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు విధిగా బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు.

బేస్‌లైన్ పరీక్షల పరిశీలన



బేస్‌లైన్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఏఎంవో బాస్కర్‌రావు

చింతపల్లి: విద్యార్థుల విద్యా సామర్థ్యానికి బేస్‌లైన్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని ఏఎంవో భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని లోతుగడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం జరిగిన పరీక్షలను ఆయన పరిశీలించారు. ఇంగ్లిషు, లెక్కలు సబ్జెక్టులలో సామర్థ్యాన్ని తెలుసుకొనేందుకు ఈ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు. వచ్చిన ఫలితాలతో మెరుగైన బోధన అందించి వారిని ముందు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టే విధంగా ఈ పరీక్షలు ఉన్నాయన్నారు. హెచ్‌ఎం ఎస్.వి.రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో సమస్యల వెల్లువ



డుంబ్రిగుడలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



రంపచోడవరంలోని మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం, వేదికపై ఎమ్మెల్యే శిరీషదేవి, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

డుంబ్రిగుడ/రంపచోడవరం/అడ్డతీగల/అరకులోయ రూరల్/హుకుంపేట/ముంచంగిపుట్టు/జి.మాడుగుల/చింతపల్లి/కొయ్యూరు/వై.రామవరం/ఎటపాక/కూనవరం/రాజవొమ్మంగి/మారేడుమిల్లి: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో సమస్యలు వెల్లువెత్తాయి. గ్రామాల్లో నెలకొన్న తాగు నీరు, రోడ్లు, డ్రైనేజీతో పాటు ఉపాధి కూలీల బకాయి వేతనాలు తదితర సమస్యలపై అధికారులకు గ్రామస్తులు తదితరులు వినతిపత్రాలు అందజేశారు.

డుంబ్రిగుడలోని జరిగిన గ్రామసభలో ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ గిరిజనులకు అన్ని పథకాలు సకాలంలో అందేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రంపచోడవరం, అడ్డతీగలలో జరిగిన గ్రామసభల్లో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి, ఐటీడీఏ పీవో కె.సింహాచలం, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలన్నారు. పీవో మాట్లాడుతూ కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. గ్రామ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

డుంబ్రిగుడలో సర్పంచ్ వెంకటరావు, ఎంపీటీసీ గీతా, వైస్ సర్పంచ్ జగ్గ నాయుడు, ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్, అరకులోయ మండలంలోని రాధిక, బుటికి, భాస్కర్‌రావు, రమేష్, సుభద్ర, బొజ్జ, శ్రీనివాసరావు, ఉపేంద్ర, దాసుబాబు, సుస్మిత, చిన్నబాబు, ప్రత్యేకాధికారి వినీల, హుకుంపేట మండలంలోని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొండబాబు తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో ఎంపీడీవో కిరణ్‌కుమార్, పిఆర్ ఏఈ గోపాలకృష్ణ, డీటీ అప్పలస్వామి, జి.మాడుగులలో సర్పంచ్ సీదరి కొండబాబు, ఎంఈవో బాబూరావుపడాల్, పీఆర్‌ఏఈ మాణిక్యం, ఏటీడబ్ల్యూవోలు తిరిపాల్, విజయ్‌కుమార్, ఏవో వీరభద్రరావు, ఏపీవో కొండబాబు, ఏవో పాత్రుడు, ఏఈ (టిడబ్ల్యు)దుర్గాప్రసాద్, ఏపీఎం సుందరమ్మ, ఈవోపీఆర్డీ డేవిడ్ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీ విజయకుమారి, చింతపల్లిలో ఎంపీపీ అనుషదేవి, జడ్పీటీసీ పోతురాజు, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఈవోపీఆర్‌డి శ్రీనివాసరావు, కొయ్యూరులో ఎంపీపీ బడుగు రమేష్, వై.రామవరంలో ఎంపీడీవో బాపన్న దొర, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, తహసీల్దార్ అనసూయ, డీటీ సుధాకరరావు, ఈఓపీఆర్‌డీ శివకుమార్, ఎంఈవో తాతబ్బాయిదొర, ఏపీఓలు సాయిబాబు, స్వామి, ఎటపాకలో డీటీ పృథ్వీ, ఏపీవో రాఘవయ్య, వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు, కూనవరంలో సర్పంచ్ అభిరామ్, ఎంపీపీ రంగమ్మ, ఏపీ, రాజవొమ్మంగిల్లో ఎంపీపీ వెంకటలక్ష్మి సర్పంచ్ సూరిబాబు, తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ రమణి, మారేడుమిల్లిలో ఎంపీడీవో వీరకిషోర్, సర్పంచ్ జార్జ్ బాబు, రంపచోడవరం సర్పంచ్ సీతమ్మ, ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీవో సత్యనారాయణ, డాక్టర్ సాహిత్, అడ్డతీగలలో సర్పంచ్ శంకరంబాబు, ఎంపీడీఓ రంగారావు, ఏపీఎం మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



అరకు వారపు సంతలో విద్యార్థులు, పోలీసుల అవగాహన ర్యాలీలో ఎస్‌ఐ సంతోషకుమార్ తదితరులు



హుకుంపేటలో అవగాహన ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు, గ్రామస్తులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని వారపు సంతను ఎస్ఐ సంతోష్‌కుమార్ సందర్శించారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న పరివర్తన కార్యక్రమంలో భాగంగా గంజాయి అనర్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆటో యూనియన్ నాయకులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి వినియోగం, గంజాయి రవాణాకు పాల్పడి విద్యార్థులు జైళ్లలో మగ్గిపోతున్నారన్నారు. చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గిరిజనులు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. గంజాయి వద్దు...చదువే ముద్దు అనే నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలి

హుకుంపేట: గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న పరివర్తన కార్యక్రమంలో భాగంగా గంజాయి అనర్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ సిబ్బంది, స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, ఆటో డ్రైవర్లు కలిసి గంజాయి సాగు నిర్మూలనపై అవగాహన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి సాగుకు గిరిజనులు దూరంగా ఉండాలని ఆయన తెలిపారు. గంజాయి కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు కిరణ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయం సాధించడం పట్ల అనేక దేశాలు భారత్‌ను ప్రశంసించాయని, అంతరిక్ష విశేషాల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

చింతూరు తహసీల్దార్‌గా చిరంజీవి



చింతూరు: మండల తహసీల్దార్‌గా చిరంజీవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చింతూరు తహసీల్దార్‌గా జేవీవీఎస్ కుమార్‌ను నియమించగా ఆయన నేటి వరకు విధుల్లో చేరలేదు. దీంతో పోలవరం ఇరిగేషన్ కార్యాలయం కూనవరం యూనిట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చిరంజీవికి చింతూరు తహసీల్దార్‌గా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన శుక్రవారం విధుల్లో చేరారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు



ప్రత్యేకాలంకరణలో శ్రీకృష్ణుడు, సుందరంగా తీర్చిదిద్దిన ఆలయ ప్రాంగణం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో సోమవారం జరిగే కృష్ణాష్టమి వేడుకలకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే స్థానిక కృష్ణుని ఆలయాన్ని, శ్రీకృష్ణభగవానుని విగ్రహాన్ని రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం వద్ద శాశ్వత ప్రాతిపదికన ఎత్తైన భారీ రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా ఇక్కడ జరిగే ఉట్టి కొట్టే వేడుకకు సమీప గ్రామాల నుంచి అశేషంగా భక్తులు తరలివస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక యువత కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా జరిపేందుకు సన్నద్ధమయ్యారు.